క్లుప్తంగా

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు



కల్లు తాగే వారికి అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

హిందూపురం టౌన్: కల్తీ కల్లు విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. గురువారం పట్టణంతో పాటు హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో కల్తీ కల్లు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై ఎక్సైజ్ పోలీసులు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ కల్తీ కల్లు సేవించడం వల్ల ప్రాణాలకు తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహా, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్‌రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌ను బహిష్కరించిన ఎంపీటీసీలు



రొద్దం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశపు భవనంతో గురువారం ఎంపీపీ నాగమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ సమావేశాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే రిజిస్టర్‌లో సంతకాలు చేయకుండా సభ్యులంతా సమవేశం నుంచి లేచి మండల మీట్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు. తమకు రావాల్సిన గౌరవ వేతనం ప్రభుత్వం మంజూరు చేయడం లేదని, అలాంటప్పుడు సర్వసభ్య సమావేశం ఎందుకని ప్రశ్నించారు. కార్యాలయం ఎదుట ఎంపీటీసీలు నిరసన తెలిపారు. కోరం లేకపోవడంతో ఎంపీడీఓ సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్, సర్పంచులు పాల్గొన్నారు.

రాధమ్మను సాగనంపాల్సిందే



ఆందోళన నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ రాధమ్మ పైసలిస్తేనే ఫైళ్లపై సంతకం పెడుతోందని, లేదంటే ఫైళ్లు పెండింగ్‌లో పెడుతోందని స్థానిక తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు జి నరసింహారెడ్డి ఆరోపించారు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ ఏసీబీ, లోకాయుక్త సంస్థలు రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఇటీవల దాడులు చేసిన సందర్భంలో రాధమ్మపై ఆరోపణలు చేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఆమెను మాత్రం ఇక్కడి నుంచి కదిలించలేకపోయారని మండిపడ్డారు. వెంటనే ఆమెను బదిలీ చేయాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గురువు స్థానం కీలకం



మాట్లాడుతన్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: గురువుల స్థానం కీలకమైనదని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాంపురం ఎంజేపీ పాఠశాలలో మెగా పేరెంట్స్– టీచర్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వంట గదిలోని శుభ్రత, భోజన నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థులు ఏ హోదాలో స్థిరపడినప్పటికీ, అందుకు కారకులైన గురువుల పాత్ర కీలకమైందన్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని పాఠశాలల్లోనూ పేరెంట్స్ - టీచర్స్ కార్యక్రమం జరిగింది.

విద్యార్థినికి ఆర్థిక సాయం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి ఉన్నత పాఠశాల స్థాయిలో ఈ ఏడాది టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ఎం పూజకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఆర్థికసాయం చేశారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని హెచ్‌ఎం నరేంద్రకు గురువారం అందించారు.



హిందూపురం: బాబా దర్శనం కోసం రైల్వే రోడ్డు వరకూ బారులు తీరిన భక్తులు



హిందూపురంలోని సత్యనారాయణపేటలో సప్తఋషులు యజ్ఞం చేస్తున్న నమూనా



నీలకంఠాపురంలో సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునుంచే సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయిబాబా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. కాగడ హారతితో వేడుకలు ప్రారంభించారు. బాబాకు మంగళస్నానం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దాదాపుగా అన్ని ఆలయాల్లోనూ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. – సాక్షిబృందం:



హిందూపురం: వెండి సింహాసనంపై సాయినాథుడు



మడకశిర: భజన చేస్తున్న సాయి భక్తులు




అగళి మండలం ఎంఎం పాళ్యంలో గురు దత్తాత్రేయస్వామి



పెనుకొండ : అలంకరణలో షిర్డిసాయిబాబా



నీలకంఠాపురంలో అలంకరణలో షిర్డిసాయి



మడకశిర: అలంకరణలో షిర్డిసాయిబాబా



రొద్దం: రుద్రపాద శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



పరిగి మండలం కొడిగెనహళ్లిలో..



హిందూపురం: హోమం నిర్వహిస్తున్న అర్చకులు



అమరాపురంలో...



హిందూపురం: అలంకరణలో దత్తాత్రేయుడు



పావగడ: భక్తులతో కిటకిటలాడుతున్న బాబా ఆలయం

మండల మీట్‌కు అధికారుల డుమ్మా

- అసహనం వ్యక్తం చేసిన ఎంపీపీ పురుషోత్తమరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు: మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టారు. ముందస్తుగా అన్ని శాఖలకూ సమాచారం ఇచ్చినా ఎవరూ లెక్క చేయకుండా గైర్హాజరు కావడంపై ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశంపై ఎందుకింత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల్లో బాధ్యత కొరవడిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కేవలం టీడీపీ నేతల భజన చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఒకరిద్దరు కార్యదర్శులు మినహా ఎవరూ హాజరు కాకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించాల్సి ఉందని, ఆర్టీసీ నుంచి అధికారి హాజరు కాలేదన్నారు. రెవెన్యూశాఖ సంబంధించి ఒక్క అధికారి కూడా హాజరు కాలేదన్నారు. సీఎం పర్యటన ఉంటే మాత్రం ఒక్కరికైనా బాధ్యత వద్దా అని ప్రశ్నించారు. మండలంలో అనేకమైన సమస్యలున్నాయని, అధికారులు లేనప్పుడు ఈ సమావేశాన్ని నిర్వహించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. చేసేది లేక పది నిముషాల్లోనే సమావేశాన్ని ముగించేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, సర్పంచ్‌లు బందేపల్లి శంకర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, మంజునాథ్‌రెడ్డి తదితరులు అధికారులు హాజరయ్యారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని నార్సింపల్లి సచివాలయంలో పంచాయితీ కార్యదర్శితో పాటు మరో నలుగురు ఉద్యోగులు ఇటీవల బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రకాష్, పవన్‌కుమార్, లావణ్య, నీరజ, సుశీల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో మోస్తరు వర్షం



దేమకేతేపల్లిలో రోడ్డు తడిచిన దృశ్యం

చిలమత్తూరు: మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల కురిసిన వర్షానికి రైతులు ఖరీఫ్ సాగులో భాగంగా వేరుశనగ, మొక్కజొన్న వేయగా వర్షం కొన్ని పంచాయితీలకే పరిమితం కాగా పదును వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గురువారం కురిసిన వర్షంతో ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు ఉపశమనం లభించింది.

క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన నాయకులు



రొద్దం చిన్నమంతూరులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు



గుట్టూరులో...

రొద్దం: మండల పరిధిలోని చిన్నమంతూరు, నల్లూరు, చోళేమర్రి గ్రామ పంచాయతీల్లో గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మి ఓటు వేసినందుకు అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని నాయకులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమ్మ తిమ్మయ్య, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, ఎన్ నారాయణరెడ్డి, రాము, లక్ష్మీనారాయణరెడ్డి, చిలకల రవి, సి.నారాయణరెడ్డి, మూలింటి రమణ, నరేంద్రరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరు, మునిమడుగు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు పేరుతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, ప్రజలను మోసగించిన విధానాన్ని ప్రజలకు తెలియచేశారు. ఇంటింటికీ వంచన పోస్టర్ల ద్వారా క్యూఆర్ కోడ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్‌రెడ్డి, గుట్టూరు సర్పంచ్ నాగరత్నమ్మ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు నాగలూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మల్లిరెడ్డి, పిట్టాబాబు, నారాయణస్వామి, పాదయాత్ర నటేష్, కిష్టప్ప, శేఖరప్ప, సానిపల్లి మల్లికార్జున, నీరుగంటి అంజి, ఓబులేష్, తదితరలు పాల్గొన్నారు.

సెల్ మోగక .. బెంగ తీరక !



గోనిపేట గ్రామం చుట్టూ ఉన్న కొండలు

పెనుకొండ: ప్రస్తుత హైటెక్‌యుగంలో ఏమి లేకున్నా సెల్ మాత్రం అందరి దగ్గర ఉండి తీరాల్సిన పరిస్థితి. అయితే సెల్‌సిగ్నల్స్ లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందులో రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పెనుకొండ కూడా ఉండటం గమనార్హం. మండలంలోని గోనిపేట గ్రామం అటవీ ప్రాంతంతో లోతట్టు ప్రదేశంలో ఉండటంతో అక్కడికి సెల్ సిగ్నల్స్ ఏ మాత్రం చేరడం లేదు. చుట్టూ కొండలు ఉండడంతో సెల్ సిగ్నల్స్ అందక ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కొండపైకి చేరుకుని సెల్‌లో మాట్లాడాల్సిన దుస్థితి. ఏ ప్రమాదం ముంచుకొచ్చినా గ్రామస్తులు కొండపైకి చేరుకుని సమాచారం చేరవేయాల్సిందే. ఇక మండలంలోని మరో గ్రామం గొందిపల్లి. ఇక్కడి ప్రజలు సైతం సెల్ సిగ్నల్స్ అందక నానా తిప్పలు పడుతున్నారు. చుట్టూ కొండలు ఉండటం కొండ కింద గ్రామం ఉండడంతో సెల్ సిగ్నల్స్‌కు ఆటంకం కలుగుతోంది. మరువపల్లిలో సైతం ప్రజలు సిగ్నల్స్ సరిగా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే పెనుకొండ పట్టణంలోని కోర్టు రోడ్డులోనూ సెల్ సిగ్నల్స్ ఏ మాత్రం అందవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కోర్టు సమీప దుకాణాల ప్రజలు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. వాట్సాప్, ఫోన్‌పే ఇలా ఏ సేవకైనా మరో ప్రాంతానికి పరుగు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. కోర్టులో ఉన్న న్యాయవాదులు కూడా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో ఉన్న సెల్ టవర్‌ను గత కొన్ని నెలల క్రితం తొలగించడమే ఇందుకు కారణం. ఇలాంటి ప్రాంతాల్లో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

సోమందేపల్లి: మండలంలోని ఈదులబళాపురం, జూలకుంట, మండ్లి గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పర్యటిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో భాగంగా జరిగే కార్యక్రమానికి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

పరిగిలో...

పరిగి: మండలంలో శుక్రవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు హొన్నంపల్లి, 8.45కి ధనాపురం, 9.45కి గణపతిపల్లి, 10.30 గంటలకు పైడేటి గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి వెంకటరమణప్ప

పావగడ: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈనెల 21న పావగడలో పర్యటించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, కలెక్టర్ శుభ కళ్యాణ్, సీఈఓ ప్రభు తదితర ఉన్నతాధికారులు సీఎం పర్యటన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. అలాగే సీఎం సభను ఏర్పాటు చేసే మహాత్మాగాంధీ క్రీడా మైదానాన్ని పర్యవేక్షించారు. ఆయన ప్రారంభించే అభివృద్ధి పనులను పరిశీలించారు. ముఖ్యంగా సీఎం ప్రారంభించే నాగలమడక క్రాస్‌లో నిర్మించిన తుంగభద్ర తాగునీటి యోజన ట్యాంకు, ఎస్సీ ఎస్టీ విద్యార్థుల హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీ శివప్ప కడగోళ, స్థానిక మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్, మాజీ అధ్యక్షుడు రాజేశ్, బత్తినేని నాని తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలుతున్న సీసీ రోడ్డు

గుడిబండ: జాతీయ ఉపాధి పథకంలో భాగంగా ఇటీవల మంజూరైన అంతర్గత రహదారుల నిర్మాణాల నాణ్యతను గాలికి వదిలేస్తూ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. బిల్లులు త్వరగా పొందేందుకు సీసీ రోడ్డు నాణ్యతను పట్టించుకోకుండా ఆఘమేఘాలపై మండల కేంద్రంలోని బ్యాంక్ సర్కిల్ నుంచి బస్టాండ్ ఆవరణం వరకూ దాదాపు 100 మీటర్ల సీసీ రోడ్డును రూ.10 లక్షల వ్యయంతో చేపట్టారు. సీసీ రోడ్డు నిర్మాణంలో ఇసుక శాతం కంటే కంకర పొడి (డస్ట్) ఎక్కువగా వాడటం, తక్కువ గ్రేడ్ ఉన్న సిమెంట్ వినియోగిస్తూ నాణ్యతను విస్మరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా కూటమి నాయకులు నిర్మాణాలను చేపట్టారని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డు వేసిన నాలుగు నెలలకే రోడ్డుపై సిమెంట్ పోయి .. కంకర తేలడంతో ఇదేం రోడ్డు వేయడం అంటూ అందరూ మండిపడుతున్నారు.



గుడిబండ బస్టాండ్ ఆవరణంలో కంకర తేలిన సీసీ రోడ్డు